క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన



విస్సన్నపేట: త్వరలో జరుగనున్న శాసన మండలి ఎన్నికలకు విస్సన్నపేటలో జరుగుతున్న ఏర్పాట్లను తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కె. మాధురి మంగళవారం పరిశీలించారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఆర్డీఓ పరిశీలించారు. తహసీల్దారు లక్ష్మీ కల్యాణి పాల్గొన్నారు.

● మైలవరం: రెడ్డిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలోని ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను తిరువూరు ఆర్డీఓ కె. మాధురి మంగళవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లపై రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలు చేశారు. రుద్రవరం గ్రామంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. తహసీల్దార్ జె. సుశీలాదేవి పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మైలవరం: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ పోరాడుతోందని, ముఖ్యంగా కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఐక్యతకు పోరాడుతోందని యూఈఈయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జె.అనిల్‌కుమార్ అన్నారు. మైలవరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఎలక్ట్రిసిటీ ఉద్యోగుల క్యాలెండర్‌ను మంగళవారం గణపవరం ఏఈ సీహెచ్ రామ్మోహనరావు, యూఈఈయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జె. అనిల్‌కుమార్ మంగళవారం ఆవిష్కరించారు. ఎం. సాయి, ఎ.గణపతి, వి. జయరాజ్ పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో గొల్లపల్లి విద్యార్థిని ప్రతిభ



నూజివీడు: జేఈఈ మెయిన్స్‌లో గొల్లపల్లికి చెందిన బోనాల నిఖిల 99.88 పర్సంటైల్ సాధించింది. గ్రామానికి చెందిన బోనాల రాఘవేంద్రరావు, హరిప్రియ ప్రథమ కుమార్తె నిఖిల చిన్ననాటి నుంచి చదువులో ముందుండేది. పదో తరగతి వరకు నూజివీడులోని త్రివిధ స్కూల్లో చదివిన ఆమె అనంతరం పశ్చిమ గోదావరి జిల్లా వేలివెన్ను శశి విద్యా సంస్థలో ఇంటర్మీడియెట్ చదివింది. అత్యుత్తమ పర్సంటైల్ సాధించిన నిఖిలను గ్రామస్తులు అభినందించారు.

పిందె రాలకుండా చర్యలు

జి.కొండూరు: మామిడి రైతులు పిందె రాలకుండా చర్యలు చేపట్టినప్పుడే అధిక దిగుబడులను సాధించవచ్చని అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ బాలాజీ అన్నారు. చెవుటూరు గ్రామంలో మామిడి రైతులకు చీడపీడల నివారణపై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మామిడిలో పిందె రాలకుండా ఉండేందుకు ఒక గ్రాము బోరాన్‌ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. కాయ తొలుచు పురుగు నివారణకు ఫెన్‌వలేరేట్ 0.5 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ నరసింహారావు, ఏడీఏ శ్రీనివాసరావు, ఏఓ రాంకుమార్, ఉద్యాన అధికారి నీలిమ పాల్గొన్నారు.

స్వామి వారి కల్యాణం



మైలవరం: మైలవరంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామి వారి తిరు కల్యాణ మహోత్సవం మంగళవారం ద్వారకా తిరుమల వేద పండితులు, అర్చక స్వాముల వేద మంత్రోచ్ఛరణలతో వైభవంగా జరిగింది. మైలవరం జమీందారు ఎస్వీ సుధాకరరావు తనయుడు ఎస్వీఎన్ నివృతరావు దంపతులు స్వామివార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. మైలవరం సాయి శ్రీనివాస సంకీర్తన సమాజం వారిచే అన్నమాచార్య సంకీర్తన జరిగింది. స్వామి వార్లను గరుడ వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం బాల భారతి నాట్యమండలి వారిచే సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

పాఠశాలకు మైక్రోస్కోప్ వితరణ

గానుగపాడు(తిరువూరురూరల్): గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ బాలికా సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థినుల్లో శాస్త్రీయ విజ్ఞానంపై ఆసక్తి పెంపొందించేందుకు ప్రయోగశాలలో మైక్రోస్కోప్‌ను జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి ఎం. రాంప్రదీప్ వితరణ ఇచ్చారు. జేవీవీ మండల నాయకులు సుదర్శన్, ప్రధానోపాధ్యాయిని ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులు సాయిరాం, రాజేంద్రప్రసాద్, రామారావు, సాంబశివరావు, వెంకటేశ్వర్లు, రాము పాల్గొన్నారు.

దీనదయాళ్ ఉపాధ్యాయకు నివాళి

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): బీజేపీ సిద్ధాంత కర్త పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి కార్యక్రమం కేతనకొండ, కాచవరంలో మంగళవారం జరిగింది. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాచవరం అమ్మా నాన్న వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. బీజేపీ మండల అధ్యక్షురాలు పయ్యావుల జయలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

స్వామి కల్యాణానికి ఏర్పాట్లు

- శ్రీనివాసుడు శఠగోప రూపంలో కొలువైన ఆలయం
- వేంకటాచలస్వామి ఆలయానికి 420 ఏళ్ల చరిత్ర
- ఏటా మాఘశుద్ధ పౌర్ణమి నాడు తిరుకల్యాణోత్సవం
- నందడిగా తిరువూరు తిరునాళ్ల



విద్యుద్దీపాలంకరణలో తిరువూరు వేంకటాచలస్వామి ఆలయం



తిరువూరు వేంకటాచలస్వామి మూలవిరాట్



పెళ్లికుమారుడైన స్వామివారు

తిరువూరు: తిరువూరు వేంకటాచలస్వామి ఆలయం చారిత్రక ప్రాధాన్యం సంతరించుకుంది. కోరిన కోర్కెలు తీర్చే కల్పతరువుగా వేంకటాచలస్వామిని ఈ ప్రాంత భక్తులు విశ్వసిస్తారు. 420 ఏళ్ల కిందట ఈ ఆలయాన్ని నిర్మించారు. ఏటా మాఘశుద్ధ పౌర్ణమి నాడు స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహిస్తారు. దేవదాయ శాఖ పరిధిలోని ఈ ఆలయానికి పలువురు దాతలు ఇచ్చిన భూములతో పాటు విలువైన ఆభరణాలు ఉన్నాయి. ఈ నెల 12న రాత్రి 10 గంటలకు శ్రీదేవీ సమేత వెంకటాచలస్వామి కల్యాణాన్ని నిర్వహించేందుకు దేవాదాయ శాఖ ఏర్పాట్లు చేసింది. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో జరిగే తిరునాళ్లకు తిరువూరు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేస్తారు.

ఆలయ చరిత్ర

1805 సంవత్సరంలో తిరువూరు జమీందారుగా ఉన్న అన్నారావు తిరుపతి వేంకటేశ్వరుడిని దర్శించుకునేందుకు కుటుంబ సమేతంగా ఎడ్ల బండిపై వెళ్లారు. అక్కడ పద్మావతి, అలివేలు మంగా సమేత వేంకటేశ్వరుడిని దర్శించుకున్న తర్వాత అక్కడే తమ శేష జీవితాన్ని గడపాలని భావించారు. అయితే వారికి వేంకటేశ్వరుడు కలలో కనిపించి తాను అభయముద్రతో కనిపించి మీ వూరు వస్తాను.. నన్ను సేవించండి అని అంతర్థానమయ్యారు. వెంటనే స్వామివారిని దర్శించుకునేందుకు అన్నారావు జమీందారును తిరుపతి వేంకటేశ్వర ఆలయ అర్చకులు పిలిచి స్వామి వారి వద్ద పూజలందుకునే శఠగోపాన్ని 16 కళలతో ప్రాణ ప్రతిష్ఠ చేసి అందజేశారు. ఆ శఠగోపాన్ని తిరువూరుకు ఊరేగింపుగా తీసుకుని వచ్చిన అనంతరం ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల దివాణం పక్కనే దేవాలయం నిర్మించి అక్కడ ప్రతిష్ఠించి నాటి నుంచి పూజాదికాలు నిర్వహిస్తున్నారు. తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి తెచ్చిన శఠగోపం తిరువూరులోని వేంకటాచలస్వామి దేవస్థానంలో నేటికీ పూజలందుకుంటోంది. క్రమం తప్పకుండా ఆలయంలో శఠగోపం ప్రతిష్ఠించిన మాఘ శుద్ధ పౌర్ణమి నాడు స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. స్వామివారి కల్యాణాన్ని వీక్షించేందుకు ఖమ్మం, కృష్ణా, ఎన్టీఆర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి భక్తులు విచ్చేస్తారు.

పెళ్లి కుమారుడైన వేంకటాచలస్వామి

కల్యాణోత్సవాలకు ముందు ఈ నెల 5వ తేదీ నుంచి వారం రోజుల పాటు అధ్యయనోత్సవాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. సోమవారం రాత్రి అంకురార్పణ, ధ్వజపట ప్రతిష్ఠ, వాస్తుపూజ, భేరీ పూజ, ధ్వజారోహణం తదితర కార్యక్రమాలను ఆలయ అర్చకులు దేవయాజనం వేణుగోపాల కృష్ణమాచార్యులు, నల్లానిచక్రవర్తుల పాండురంగ విఠలాచార్యులు, దివి ఉదయ కుమారాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. మంగళవారం స్వామి వారిని పెళ్లి కుమారుడిగా అలంకరించి విశేష హోమాలు చేశారు. బుధవారం రాత్రి 10 గంటలకు వేంకటాచలస్వామి కల్యాణోత్సవాన్ని జరపనున్నట్లు అర్చకులు తెలిపారు. 13న గరుడ వాహనంపై గ్రామోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు, 14న స్వామివారి రథోత్సవం, 15న తీర్థగోష్ఠి, చూర్ణోత్సవం, చక్రవరి, పూర్ణాహుతి, 16న అద్దాల మండపంలో పవళింపు సేవతో కార్యక్రమాలు ముగుస్తాయి.

గణిత పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

నూజివీడు: రామనుజం ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో గణితం అంశంలో నిర్వహించిన ప్రతిభ పరీక్షలో పట్టణంలోని త్రివిధ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారని ప్రిన్సిపాల్ సబ్బినేని శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఆరో తరగతికి చెందిన వై. సత్యనారాయణ, అనన్య రాగా జిల్లాలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారని చెప్పారు. ఏడో తరగతికి చెందిన ఎ. దుర్గాశరణ్య, డి. సుమతి ద్వితీయ స్థానంలో, ఎనిమిదో తరగతికి చెందిన బి. షణ్ముఖనందన్, ఎస్ఆర్ఎస్ రుద్రిత్, గీతికాలక్ష్మి ద్వితీయ స్థానంలో, తొమ్మిదో తరగతికి చెందిన ఎంవీఎస్ పవన్‌కృష్ణ, వి. చైతన్య జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో, పదో తరగతికి చెందిన బి. చరితశ్రీ , యశ్వంత్‌నాయుడు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. వీరిని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

సేంద్రియ ఎరువులను వాడాలి

చాట్రాయి: రసాయనిక ఎరువులను విడనాడి సేంద్రియ ఎరువులను వాడాలని వ్యవసాయ అధికారి బి. శివశంకర్ రైతులకు సూచించారు. మండలంలోని చనుబండలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు అగ్రి పోర్టల్‌లో భూముల వివరాలను ఆర్ఎస్‌కేల్లో నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోరంపూడి శ్రీనివాసరావు, చీదిరాల మాల్యేశ్వరావు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్స్ పంపిణీ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి జెడ్పీ బాలికోన్నత, బాలుర పాఠశాలల్లో 245 మంది పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను మంగళవారం పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన అత్తులూరి సీతారాంప్రసాద్, అరుణ దంపతులు సౌజన్యంతో వీటిని బహూకరించారు. హెచ్ఎం మంగళగిరి లక్ష్మీసుహాసిని, ఎస్ఎంసీ చైర్మన్ జుబాజ్ బీ పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ విశిష్ట సంఖ్య నమోదు

నూజివీడు: భూమి గల ప్రతి రైతుకూ విశిష్ట సంఖ్య నమోదు ప్రక్రియ రైతు సేవ కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు ఏడీఏ జి. విద్యాసాగర్ మంగళవారం తెలిపారు. భూమి గల ప్రతి రైతుకు ఒక ప్రత్యేక సంఖ్యను ఇవ్వడం ద్వారా వ్యవసాయ సేవలను సులభతరం చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. ఈ గుర్తింపు సంఖ్య రైతు రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు చేసిన తరువాత ప్రతి ఒక్కరికీ ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కేటాయిస్తారని చెప్పారు. ప్రభుత్వ పథకాలు, రాయితీలు, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందడానికి ప్రతి రైతు తమ వివరాలను నమోదు చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించి వివరాలు నమోదు చేయడం ద్వారా రైతు గుర్తింపు సంఖ్యను పొందవచ్చని చెప్పారు. రైతులు వారి ఆధార్ నంబర్, ఆధార్‌తో లింక్ అయిన ఫోన్ నంబర్, పట్టాదారు పాసు పుస్తకం తీసుకుని రైతు సేవా కేంద్రానికి వెళ్లి నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రైతు విశిష్ట కార్డుకు పేర్ల నమోదు

ఇబ్రహీంపట్నం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు విశిష్ట కార్డుల కోసం రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి డి.శైలజ అన్నారు. మండల వ్యవసాయ కేంద్రంలో రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం రైతుల వివరాలను ఏపీఎఫ్ఆర్ పోర్టల్ ద్వారా నమోదు కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. పలువురు రైతుల నుంచి వివరాలు సేకరించి పోర్టల్‌లో నమోదు చేశారు. కేంద్రం ప్రవేశపెట్టిన పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, వ్యవసాయ యాంత్రీకరణ వంటి పథకాలు పొందేందుకు రైతు విశిష్ట కార్డు తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. సొంత పొలం కలిగిన రైతులు ఆధార్ కార్డు, ఆధార్‌తో నమోదైన ఫోన్ నంబర్, పొలం పాస్ పుస్తకంతో గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో సైతం రైతు విశిష్ట నంబర్ కోసం నమోదు చేసుకోవచ్చని వివరించారు.

● రాయనపాడు(విజయవాడరూరల్): ప్రతి రైతు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయాధికారి విజయకుమారి రైతులకు సూచించారు. రాయనపాడు రైతు సేవా కేంద్రంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పెట్టుబడి, ఎరువుల రాయితీలు, పంటల బీమా పంటలకు కనీస మద్దతు ధర, పంటల రుణాలు వివిధ రకాల వ్యవసాయ, అనుబంధ రంగాల శాఖల సేవలకు ఫార్మర్ రిజిస్ట్రీ అవసరమన్నారు. పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్సు, 1-బి, ఆధార్ జిరాక్సు, ఆధార్ నంబర్‌కు లింక్ అయిన ఫోన్ తీసుకుని గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి నమోదు చేయించుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో దాళ్వా పంటల సాగుపై చర్చించారు. వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు బి.వెంకటేశ్వరరావు, మండల వ్యవసాయాధికారి బి.రంగనాథ్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ

ముసునూరు: సమగ్ర శిక్షా అభియాన్ మండల విభాగం ఆధ్వర్యంలో దివ్యాంగ బాలల తల్లిదండ్రులకు రమణక్కపేట మెయిన్ ప్రాథమిక పాఠశాల భవిత కేంద్రంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. దివ్యాంగ బాలల సౌకర్యాలు, వసతులు, తీసుకోవలసిన జాగ్రత్తలను ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు వివరించారు. అనంతరం ఫిజియో థెరపిస్ట్ ప్రశాంతి ఐదుగురు దివ్యాంగ బాలలకు ఫిజియోథెరపీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం లోకరాజు, ఐఈఆర్ టీచర్లు డీఎంవీ లక్ష్మీనారాయణరావు, నాగ మల్లేశ్వరి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి దాతల విరాళాలు



తిరువూరు: స్థానిక జగన్నాథపురం కాలనీలోని పాటిమీద దాసాంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి పలువురు దాతలు మంగళవారం విరాళాలు అందజేశారు. నాళ్లా పాండురంగారావు రూ.25,116, మందా శోభనాద్రి రూ.20,116, సురభి శ్రీనివాసరావు, కిలారు నగేష్, శీలం సుధాకరరెడ్డి రూ.10,116 చొప్పున, వెన్నం రాజశేఖరరెడ్డి, కుక్కడపు సుబ్బారావు, గుర్రం శివప్రసాద్, దారా వెంకట సీతారాంప్రకాష్ రూ.5,116 చొప్పున విరాళాలను ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వెల్లంకి సురేంద్రబాబుకు అందజేశారు.

బాల రావమ్మకు ప్రత్యేక పూజలు



ఆగిరిపల్లి: తోటపల్లిలోని దుగ్గిరాల బాల రావమ్మ తిరునాళ్ల రెండవ రోజు మంగళవారం భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు సహస్ర కుంకుమార్చన, పల్లకీ సేవ నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తిని గ్రామంలో ఊరేగించారు. కనసానపల్లి, ఆగిరిపల్లిలోని రావమ్మ తల్లిని ప్రత్యేకంగా అలంకరించారు.

ఆత్మీయ కలయిక





వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన కుటుంబరావు, కోటేశ్వరి, బండి రవికుమార్, సుజాత తదితరులు

తిరువూరురూరల్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డిని తిరువూరు మండలంలోని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు తాడేపల్లిలోని ఆయన నివాసంలో మంగళవారం కలిశారు. తిరువూరు మండలం ఆంజనేయపురం సర్పంచి మామిడి కుటుంబరావు, ఎంపీటీసీ సభ్యురాలు కోటేశ్వరి, రోలుపడి గ్రామానికి చెందిన రాష్ట్ర సాంఘిక సంక్షేమ బోర్డు మాజీ డైరెక్టరు బండి సుజాత, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బండి రవికుమార్ తదితరులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన వారిలో ఉన్నారు.

సస్యరక్షణతో తెగుళ్ల నివారణ

విస్సన్నపేట: రబీ సీజన్‌లో పంటలకు తెగుళ్లు రాకుండా రైతులు ముందస్తు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని విస్సన్నపేట మండల వ్యవసాయాధికారి రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని కొర్లమండ, కలగర గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వ్యవసాయ శాఖ సూచనలు పాటిస్తూ పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వివరించారు. రైతులు గుర్తింపు కార్డులు పొందడానికి రైతు సేవా కేంద్రాల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

తిరువూరురూరల్: మల్లేల, రామన్నపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. తిరువూరు సహాయ వ్యవసాయ సంచాలకులు జె. కెనడీ, వ్యవసాయాధికారి పద్మ పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. ప్రతి రైతుకూ 11 అంకెల గుర్తింపు సంఖ్యను వ్యవసాయ శాఖ జారీ చేస్తోందని, సొంత భూమి కలిగిన రైతులు తప్పక ఈ అవకాశం వినియోగించుకోవాలని కోరారు.

నూతన కౌలు చట్టం తేవాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న కౌలు రైతు సంఘం నాయకులు

ఇబ్రహీంపట్నం: కౌలు రైతుల సంక్షేమం, రక్షణకు నూతన కౌలు చట్టం తీసుకు రావాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, ఉపాధ్యక్షుడు మల్నీడి యలమందరావు డిమాండ్ చేశారు. సమగ్ర కౌలు చట్టం తీసుకు రావాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళన నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులతో కౌలు రైతుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. ఆహారం, ఉద్యాన పంటలు పండిస్తున్న కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆర్థిక సహాయం అందడం లేదని చెప్పారు.

అన్నదాత సుఖీభవ, పంటల పెట్టుబడి సాయం రూ.20 వేలు, పంటల బీమా పథకం అమలు చేయాలని, పొలం యజమానుల ప్రమేయం లేకుండా కౌలు గుర్తింపు కార్డులతో పంట రుణాలు, ఇతర ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందజేయాలని కోరారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు బుడ్డి రమేష్, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు, చెరుకూరి వేణుగోపాల్, సుబ్బారావు పాల్గొన్నారు.

చెక్కపల్లి హైస్కూల్లో ఎంఈఓ తనిఖీ



ముసునూరు: పదో తరగతి విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు అన్నారు. చెక్కపల్లి జెడ్పీ హైస్కూను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్రమశిక్షణ, పట్టుదల, దీక్షతో చదివి 10 తరగతి విద్యార్థులు ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాల రికార్డులు, మధ్యాహ్న భోజన నిర్వహణ రికార్డులను తనిఖీ చేసి, పిల్లలతో కలిసి భోజనం చేశారు. హెచ్ఎం అబ్బాస్, స్టాఫ్ సెక్రటరీ పద్మకిశోర్, ఉపాధ్యాయులు రాజశేఖర్, రాంబాబు, పద్మలత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రచారం

చాట్రాయి: కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న కేఎస్ లక్ష్మణరావును గెలిపించాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జి. రాజు కోరారు. మంగళవారం మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి లక్ష్మణరావుని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మేరీ హోలీ, టీఎస్ సూరి, అశోక్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌పై వర్క్‌షాప్



మాట్లాడుతున్న ప్రదీప్‌కుమార్

మైలవరం: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్ విద్యార్థులకు రియల్ టైమ్ ప్రాజెక్టులు చేసే అవకాశం ఎంతో ఉందని ఎస్‌హెచ్ అండ్ ఐఎస్ కంపెనీ డైరెక్టర్ ఎస్. ప్రదీప్‌కుమార్ అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) అంశంపై ఐదు రోజుల వర్క్‌షాపు మంగళవారం ప్రారంభమైంది. ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ ఏఐ ప్రపంచంలో ప్రాజెక్టులను ఐఓటీతో అనుసంధానం చేయడం ద్వారా ఎన్నో గొప్ప సమస్యలకు సమాధానం కనుగొనవచ్చన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు మాట్లాడుతూ కోర్సులో లేని అధునాతన అంశాలను వర్క్‌షాప్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. డీన్ ఇండస్ట్రియల్ రిలేషన్స్ డాక్టర్ వి. సూర్యనారాయణ మాట్లాడుతూ ఇలాంటి వర్క్‌షాపుల ద్వారా విద్యార్థులు పరిశ్రమలకు అనుగుణంగా వారి స్కిల్ సామర్థ్యం పెంచుకునేందుకు ఉపయోగపడుతుందని చెప్పారు. హెడ్ ఆఫ్ ద డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఓ.రమాదేవి మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు ఇటువంటి వర్క్‌షాపుల ద్వారా ఎన్నో హాకథాన్స్, ప్లేస్‌మెంట్స్ సాధించారని వివరించారు. కె. సుధాకర్, వి. సౌజన్య, పి.మాధవి, కె. లక్ష్మీ పద్మావతి కో-ఆర్డినేటర్లుగా వ్యవహరించారు.

సీఎల్ బుక్స్ అందజేత



మైలవరం: ఉపాధ్యాయుల పీఆర్సీ బకాయిలు ఎస్ఆర్‌లో నమోదు చేయాలని పీఆర్‌టీయూ నాయకుడు పి. గోపాల్ అన్నారు. మైలవరం ఎస్వీ ఆర్జీఎస్ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎంఈఓ ఎల్. బాలు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సతీష్‌కుమార్ ద్వారా సీఎల్ బుక్స్ మంగళవారం ఆవిష్కరించి ఉపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో పుల్లారెడ్డి, సతీష్, వెంకటేష్, వాణి, రత్తయ్య, కృష్ణారావు, జ్ఞాన ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాలకు ముసుగులు



చాట్రాయి: కోటపాడులో ఎట్టకేలకు పంచాయతీ సిబ్బంది ఎన్నికల కోడ్‌ను అమలు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్ అమలు చేయకుండా కోటపాడు, చీపురుగూడెంలో రాజకీయ నాయకుల విగ్రహాలకు, ఫ్లెక్సీలకు ముసుగులు వేయలేదు. దీనిపై చాట్రాయి కోడ్ పట్టదోయి శీర్షికన మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీ సిబ్బంది రాజకీయ నాయకుల విగ్రహాలకు, ఫ్లెక్సీలకు ముసుగులు ఏర్పాటు చేశారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మైలవరం: రెడ్డిగూడెం మండలం రంగాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి ఆన్‌లైన్‌లో మార్చి 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్. తబిత మంగళవారం తెలిపారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 6న జరుగుతుందని చెప్పారు. ఇతర వివరాలకు రంగాపురం గురుకుల పాఠశాలలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.